# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఎదురవుతున్న సవాళ్లను అవకాశంగా తీసుకుని పోలీసు అధికారులు పని చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.
2. 'నిశ్శబ్దాన్ని చేదిద్దాం' నినాదంతో 2030 సంవత్సరం నాటికి ఎయిడ్స్ నివారణే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు.
3. సంక్రాంతి పండుగ అనంతరం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదు జమ చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి వెల్లడించారు.
4. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అంశాలపై ఏర్పాటైన ఉభయ రాష్ట్ర అధికారుల కమిటీ ఈ మధ్యాహ్నం మంగళగిరిలో సమావేశం కానుంది.
5. తుపాను ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ పేర్కొంది.

==========================

డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలు, కృత్రిమ మేధ-ఏఐ వంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఎదురవుతున్న సవాళ్లను ఒక అవకాశంగా తీసుకుని పోలీసు అధికారులు పని చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన ఆల్ ఇండియా కాన్ఫరెన్స్ ఆఫ్ డైరెక్టర్స్ జనరల్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డీజీపీ, ఐజీపీల మూడు రోజుల ముగింపు సదస్సులో ప్రధానమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ మాట్లాడుతూ, సాంకేతికతను వినియోగించి పోలీసుల పని భారాన్ని తగ్గించాలని సూచించారు. వ్యూహాత్మకంగా, విశ్వసనీయంగా, పారదర్శకంగా వ్యవహరించడం ద్వారా స్మార్ట్ పోలీసింగ్ విధానాన్ని అనుసరించాలని ప్రధానమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

--------------------------

ఎయిడ్స్ నివారణ దినోత్సవంలో భాగంగా 'నిశ్శబ్దాన్ని చేదిద్దాం' నినాదంతో 2030 సంవత్సరం నాటికి ఎయిడ్స్ నివారణే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 3.25లక్షల మంది హెచ్ఐవీతో బాధపడుతున్నారని చెప్పారు. ఎయిడ్స్ నివారణకు అవగాహనతో పాటు, చికిత్స ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ వ్యాధి నియంత్రణకు, అందరికీ ఆరోగ్యం, గౌరవానికి భరోసా ఇద్దామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

--------------------------

సంక్రాంతి పండుగ అనంతరం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదు జమ చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, రైతు భరోసాపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించామన్నారు. శాసన సభలో చర్చించి త్వరలో విధివిధానాలు ఖరారు చేస్తామని తెలిపారు. రేషన్ కార్డులపై నాణ్యమైన బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

..వాయిస్...25 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి తెలిపారు. కేంద్రం ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి నిర్దేశించిన 'ప్రసాద్ పథకం' అంశంపై దేవాదాయశాఖ మంత్రి నిన్న విజయవాడలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రసాద్ పథకం నియమ నిబంధనలకు అనుగుణంగా ఇంద్రకీలాద్రి అభివృద్ధి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యేలా దేవాదాయ, పర్యాటక శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి సూచించారు.

---

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అంశాలపై ఏర్పాటైన ఉభయ రాష్ట్ర అధికారుల కమిటీ ఈ మధ్యాహ్నం గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో సమావేశం కానుంది. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న అపరిష్కృత అంశాలపై సభ్యులు చర్చించనున్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు హాజరవుతారని అధికారులు తెలిపారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో నవంబరు నెలలో వస్తు,సేవల పన్ను – జీఎస్‌టీ వసూళ్లు 3 వేల 699 కోట్ల రూపాయలుగా ఉన్నాయని కేంద్ర ఆర్థికశాఖ తెలిపింది. గత ఏడాది నవంబరులో రాష్ట్రంలో జీఎస్‌టీ కింద 4 వేల 93 కోట్ల రూపాయలు వసూలు కాగా.. ఈ ఏడాది నవంబరు నెలలో 10% తగ్గుదల నమోదైందని పేర్కొంది. అలాగే తెలంగాణలో వస్తు,సేవల పన్ను జీఎస్‌టీ వసూళ్లలో గత నవంబరు నెలలో 3% వృద్ధి నమోదైందని పేర్కొంది. గత ఏడాది ఇదే నెలలో 4 వేల 986 కోట్ల రూపాయలు వసూలు కాగా, అది ఈ ఆర్థిక సంవత్సరం నవంబర్‌లో 5 వేల 141 కోట్ల రూపాయలకు పెరిగినట్లు తెలిపింది.

---

రాజమహేంద్రవరం–ముంబై మధ్య విమాన సర్వీసులు ప్రారంభం అయ్యాయని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్. తెలిపారు. ముంబై నుంచి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకున్న ఇండిగో విమానానికి మంత్రి గత రాత్రి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విమానయాన సంస్థలు టికెట్ ధరలు తగ్గించి సామాన్య ప్రజలకు విమాన సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.రాజమహేంద్రవరం విమానాశ్రయాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ( 32 సెకన్లు)

---

సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక, ఆర్థిక సవాళ్లను సమర్ధవంతంగా  ఎదుర్కోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి  భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కేరళ రాష్ట్రం కొల్లంలోని నారాయణ గురు సార్వత్రిక విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న నారాయణ గురు అంతర్జాతీయ అక్షరాస్యత, సాంస్కృతిక ఉత్సవంలో భాగంగా నిన్న  జరిగిన సదస్సులో ఆయన  మాట్లాడుతూ, తెలంగాణ, కేరళ రాష్ట్రాల మధ్య ఆలోచనల్లో సారూప్యత ఉందని, కేరళలోని నారాయణ గురు తరహాలోనే తెలంగాణలో కుమురం భీం, చాకలి ఐలమ్మ సమానత్వం కోసం పాటుపడ్డారని చేశారని చెప్పారు. తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణకు, సమీకృత  పాఠశాలల నిర్మాణానికి నారాయణ గురు స్ఫూర్తి అని  వివరించారు.

---------------------------

ఫెయింజల్ తుపాను పుదుచ్చేరి నుంచి పశ్చిమ దిశగా కదులుతూ వాయుగుండంగా బలహీన పడుతుందని అమరావతి వాతావరణ కేంద్రం  తెలిపింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈరోజు  అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు పడే అవకాశముందని తెలిపింది. తీరంలో గంటకు గరిష్ఠంగా 60 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని,  మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం సూచించింది . పోర్టులకు జారీచేసిన ప్రమాద హెచ్చరికలు ఉపసంహరించినట్లు తెలియచేసింది. తుపాను ప్రభావంతో రాష్ట్రంలో రాయలసీమ, దక్షిణ కోస్తాలో సుమారు 10 వేల ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంట దెబ్బతిందని అధికారులు తెలియచేశారు.

తుఫాను ప్రభావంతో  తెలంగాణలోనూ  రాగల మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆయా  జిల్లాలకు ఎల్లో  ప్రమాద హెచ్చరికను జారీ చేసింది.

---------------------------

తిరుపతి పట్టణంలో దాని పరిసర ప్రాంతాల్లో నివాసముండే స్థానిక ప్రజలకు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శన టోకెన్ల మంజూరు ప్రక్రియ ఈరోజు నుంచి ప్రారంభమైంది. టోకెన్ల జారీ ప్రక్రియను తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్యామలరావుతో కలిసి ఈ ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా బి.ఆర్. నాయుడు మాట్లాడుతూ...

..వాయిస్.. 27 సెకన్లు

---------------------------

ఈరోజు అంతర్జాతీయ బానిసత్వ నిర్మూలన దినంగా పాటిస్తున్నాం. బానిసత్వాన్ని నిషేధించి రెండు శతాబ్దాలైనప్పటికీ... కొన్ని చోట్ల సంప్రదాయ పూర్వకంగా ఉంటే, మరికొన్ని చోట్ల కొత్త రూపాలలో ఇంకా కొనసాగుతోంది. 1949 డిసెంబర్ 2వ తేదీన మానవ అక్రమ రవాణాపై  ఐక్యరాజ్య సమితి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అప్పటినుంచి డిసెంబర్ 2వ తేదిని అంతర్జాతీయ బానిసత్వ నిర్మూలన దినంగా ప్రకటించారు. వెట్టిచాకిరి, బాలకార్మికులు, అక్రమ రవాణాల రూపంలో ఇంకా బానిసత్వం కొనసాగుతున్న విషయాన్ని అందరికీ తెలియజేసి.. దీనిని నిర్మూలించేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఈ సదర్భంగా పలు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాయి.

=====================